# నిషిద్ధాక్షరి

"సరి క్రొత్త కథ చెపుతాను" అన్నాడు అడ్వొకేటు ఆనందరెడ్డి.

"అది నీ తరంగాదు!" ఏక కంఠంతో అడ్డు తగిలారు మిత్రులిద్దరూ.

రెడ్డి ప్రాక్టీసులేని లాయరుగా నగరంలో ఎంతటి ప్రసిద్ధుడో, రచయితగా దేశంలో అంతటి ప్రసిద్ధుడు. లేని ప్రాక్టీసు ఎలాగూ లేనే లేదు. రాణించిన రచనా వృత్తి మూలంగా ముప్పూటలా తిండికాదు. సరికదా, ఒకపూట ఉపాహారానికైనా వెరవు లేదు. ఐనా ఆనందరెడ్డి అదృష్టవంతుడు. గ్రామంలో అతనికి పిత్రార్జితమైన ఆస్తిపాస్తులు దండిగా ఉన్నాయి. క్లయింట్లు రాకపోయినా, కథలు తరచుగా ప్రచురింపబడకపోయినా జీవితంపైన విసుక్కునే దురవస్థను భగవంతుడతని నుదుట వ్రాసిపెట్ట లేదు.

అడ్డు తగిలిన మిత్రుల్లో మొదటివాడేమో రాధాపతి. ఏదో ఆఫీసులో మరీ అంత చిన్నదో – పెద్దదో కాని ఉద్యోగం చేస్తున్నాడతను. 'లా'కు వెళ్లలేదు గానీ. ఆ పనిచేసి ఉన్నట్టయితే తాను పెర్రీ మాసన్ లాంటి క్రిమినల్ లాయరై ఉండవచ్చునన్న ఆత్మవిశ్వాసం రాధాపతికుంది. రెండో మిత్రుడు దామోదరం. హైస్కూల్లో ఉపాధ్యాయుడు. నైతికంగా ఉపాధ్యాయ వృత్తిలో దీటు రాగలిగినది ప్రపంచంలో మరొకటి లేదన్నది దామోదరం యొక్క నమ్మకం. బి.టి.కన్నా బి.ఎల్. మెరుగైనదని ఎవరైనా చెబితే దామోదరం మండిపడతాడు. 'లాయరా, టీచరా – ఎవరు గొప్ప?' అన్న విషయం పైన అంతర్జాతీయంగా చర్చ జరిగితే, ఆ చర్చలో టీచర్లకు ప్రతినిధిగా తాను పాల్గొనే అవకాశం లభిస్తే, అప్పుడు లాయర్లు కందరికీ ఖాయిలా వచ్చినంతపని అవుతుందని దామోదరానికొక నిశ్చితమైన అభిప్రాయం కద్దు!

పోగా అనందరెడ్డిలోని రచయితను గురించి మిత్రద్వయానికి తెలిసింది చాలా తక్కువ. రచనా వృత్తి అనగా అదొక పెట్టుబడి లేని లాభసాటి బేరమని వాళ్ళ అభిప్రాయం. ఎంతో కొంత ఆదాయమే గనుక రాకపోతే వాళ్లు దాన్నొక వృత్తిగానే పరిగణించక పోదురు...

తానొక సరికొత్త కథ చెబుతా నన్నాడా రెడ్డి. అది నీతరం గాదు పొమ్మన్నారా మిత్రులిద్దరలా. ఆ విధంగా ఈ కథ మొదలైంది.

"ఎందుకంటే..." వివరణ ప్రారంభించాడు రాధాపతి. "లోకంలో చెప్పడాని కింక కథలేవీ మిగిలి లేవు. నువ్వేకథ చెప్పాలనుకున్నా, దాన్ని ఇంతకు ముందెవరో చెప్పే వుంటారు. ఆ చెప్పడం గూడా బహుశా నీ కంటే బాగానే చెప్పి వుండవచ్చు..."

"బహుశా ఏమిటి! ఆ మాట నిష్కర్షగానే చెప్పరాదా రాధాపతీ!" అందుకున్నాడు దామోదరం. "మునుపు మన కథకులు కథలకోసం ఇరుగు పొరుగు భాషల్లోని పత్రికలన్నీ గాలించేవారు. లేదా మన తెలుగువే పాత పత్రికలు కొన్ని తిరగవేసేవారు. ఇటీవల మరీ తెలివి మీరిపోయి బి.సి. నాటికే వెళ్ళిపోతున్నారు. ఎలా గంటావా? అదే చెబుతున్నాను. మొన్న మా హెడ్మాస్టరుగారు ఓ పత్రిక తీసుకొచ్చి అందులో ఒక కథ బ్రహ్మాండంగా

వుందన్నాడు. తీరా చదివి చూద్దును గదా, నవ్వొచ్చింది నాకు! మూలం మహా భారతమనిగానీ, వేద వ్యాసునికి అనుసరణ అని గాని వ్రాయలేదు. కానీ అది పేర్లు మార్చి వ్రాసిన కుంతీ కర్ణుల కథ!"

"నిజమే బ్రదర్స్, నిజమే!" అన్నాడు రెడ్డి. "కానీ ఒక విషయాన్ని గమనించాలి మీరు. కథలు ఆకాశం నుండి వూడిపడవు. అవి జీవితంలో నుంచి పుట్టుకొస్తాయి. మరి ఆ జీవితం మానవుడిదే కద! ఆ మానవుణ్ణి తయారు చేయడానికి భగవంతుడు ఉపయోగిస్తున్న ముడి సరుకు నాటికీ నేటికీ ఒకటే గదా! కోపతాపాలు, రాగద్వేషాలు, కోరికలు, ఆశలు, భేదాలు – ఆమోదాలు – వాటిలో మార్పురాలేదు గదా! మరింక దేశ చరిత్రలే పునరావృత్తం అవుతుండగా కథ మళ్ళీ మళ్ళీ చెప్పబడడంలో ఆశ్చర్యమేముంది? రామకథను ఎంత మంది వ్రాశారు కారు? ఎందరు వ్రాసినా మనం మళ్ళీ మళ్ళీ రామాయణాన్ని చదువుకోడం లేదా? అందువల్ల నేను చెప్పే దేమిటంటే..."

రెడ్డి కేస్‌లోంచి సిగరెట్టు పైకి తీశాడు. టక్కున అగ్గిపుల్ల గీశాడు.

"నువ్వేమీ చెప్పలేదు సిగరెట్టు ముట్టించుకున్నావు" అన్నాడు రాధాపతి.

"శాంతం, శాంతం. నేను చెప్పే దేమిటంటే – ఇతి వృత్తాలన్నీ పాతబడి పోయాయి; క్రొత్త వాటిని రచయితలు వెదికి పట్టలేరని మీరు చెబుతున్నారు గనుక కథలో మీరు పట్టి చూడవలసిన విషయం ఇతివృత్తం పాతదా, కొత్తదా అన్నది కానే కాదు..."

"మరైతే నీ ఉద్దేశంలో సరికొత్త కథ. అంటే ఏమిటోయ్ రెడ్డీ!"

"ఇదివరకు నేను చెప్పని కథ. నేను చెప్పగా మీరు వినని కథ!"

"నిర్వచనం సాదాగానే వుంది గనుక అభిప్రాయ భేదాలకు తావు లేనట్టే!" తప్పనిసరై ఒప్పుకుంటున్నట్టుగా అన్నాడు దామోదరం.

"ఏమాత్రం కథకైనా ఉపోద్ఘాతం ఒకటుండాలిగదా! అందుకే చెబుతున్నాను, ఇది కల్పనా కథ కాదు. కేవలం జరిగిన కథ."

"ఇలాంటి ఠస్సాలకు మోసపోయేంతటి అజ్ఞానులం కాము."

"కథ పూర్తిగా విన్న తర్వాత గానీ నా మాట ఠస్సా అవునో కాదో తెలియదు."

"అలాగైతే నీ మాటలోని నిజానిజాలు తెలుసుకోడానికైనా మేము కథంతా వినవలసిందే నన్నమాట!" బిక్కమొగం పెట్టాడు రాధాపతి.

"నిర్బంధ మేమీ లేదు. గమ్యస్థానానికి టిక్కెట్టు కొనుక్కుంటాం. వెళ్ళడం అనవసర మనిపిస్తే మధ్యలో ఏ స్టేషనులోనైనా దిగిపోవచ్చు."

"కానీ ఈ రైలు గమ్యస్థానాన్ని చేరుకుంటుందా అన్నదే సందేహం."

"నిజమే! ఈ మధ్య గొలుసు లాగి రైళ్ళను ఆపడం మరీ మామూలు పనైపోయింది. అది రూలుకు విరుద్ధం. పోగా ఇకపైన గొలుసు లాగవద్దని వేడుకుంటూ ఇదిగో, రైలు కదులుతోంది. ప్రతి కథకూ ఒక నాయకుడుంటాడు. ఉండి తీరాలి గూడా! మరి నా కథానాయకుడి పేరేమిటంటే–"

టక్‌మని అడ్డు తగిలాడు రాధాపతి – "నేను చెబుతానోయ్! నూటికి డెబ్బయి అయిదుపాళ్ళు వాడి పేరు సుబ్బారావై వుంటుంది. అదీ గాకపోతే నరసింహం. కాదా వెంకట్రావు."

"ముసలాడైతే చలమయ్య..."

"పడుచువాడైతే గోపాలం..."

"ఆపం దాపండి!" బిగ్గరగా నవ్వసాగాడు రెడ్డి. "మీరు తీసుకుంటున్న శ్రమకు కృతజ్ఞుడ్ని. కానీ మీ ఊహాశక్తి ఇలా వృధాగావడం నాకిష్టంలేదు. మీరిలా జాబితా కట్టి వెయ్యి పేర్లు చెప్పినా సరే. నా కథానాయకుడి పేరు మాత్రం పసిగట్టలేరు."

"ఓ యబ్బో. ఎవడయ్యా ఆ అనామకుడు?"

"సనామకుడే! అతడి పేరు బషీరుద్దీను."

"జలాలుద్దీను బంధువా ఏమిటి?"

"గొలుసు లాగినా ఒక రైలాగదు. అప్పుడు నేను బియ్యే మొదటి సంవత్సరం చదువుకుంటున్నాను. మదరాసులో – కాలేజీ అంటే మీకు తెలుసు. అది కాలేజి లా వుండదు. అరణ్యంలా వుంటుంది. అరణ్యంలో అంతఃపుర మనడం సముచిత మేమో! ప్రాకారకుడ్యం దాటి ఒకటి రెండు ఫర్లాంగుల దూరం వెళితేగాని లోపల పెద్ద పెద్ద కట్టడాలున్న సంగతి తెలియదు. నగరానికి కాలేజీ చాలా దూరం. నగరంలోని ఆనందాలకు కాలేజీకి మరింత దూరం. కనీసం ఒక సినిమాచూచి రావాలన్నాసరే, అందుకు విశ్వప్రయత్నం చేయవలసివచ్చేది. అలాంటి కట్టుదిట్టాలుండే వక్కడే. ప్రిన్సిపాలు మాక్డొనాల్డు దొరగారు చండశాసనులు. మా హాస్టలు వార్డెను లూసఫ్ లోకనాథన్‌ది కోతిపట్టు. వానరుడు నరుడుగా మారుతూ వచ్చిన పరిణామ క్రమంలో ఒకానొక దశకు ప్రతిబింబంగా వుండేది అతని ఆకారం. ప్రిన్సిపాలుకూ, వార్డెనుకు ఏకాభిప్రాయం కుదిరితే ఒక విద్యార్థిని ఏం చెయ్యాలన్నా చేయగలిగేవారు. ఒక్క ఆదివారం పగటివేళల్లో తప్పితే మరెప్పుడూ నగరంలోకి వెళ్ళరాదు మిన్నులు విరిగిపడినా సరే, మేదిని చీలినా సరే నియమాతిక్రమణం జరగడానికి వీలు లేదు. నేను కాలేజీలో చేరి అప్పటి కింకా నెల రోజులు కాలేదు. అక్కడి శిక్షాస్మృతి నాకింకా ఒంటబట్టలేదు. నగరంలో 'శాంసన్ అండ్ దలైలా' ఆడుతోంది. వెళ్ళి చూశాను. ఎలక్ట్రిక్ రైల్లో తిరిగి వచ్చి స్టేషనులో దిగాను. గంట పదకొండు. స్టేషను నుంచి కాలేజి కాంపౌండుకు అరమైలు దూరం వుంటుంది – రోడ్డు కటూ ఇటూ చెల్లా చెదరుగా ఇళ్ళయితే వున్నాయి గానీ, అప్పటికే గాఢనిద్రలో వున్నాయి. రోడ్డు నిర్జనంగా వుంది. జరుగుతున్నది పందు చలికాలం. కప్పుకోడానికి బట్టలులేక చేతులు ముడుచుకుని కూర్చున్న కాందిశీకుల్లా చెట్లు సైతం చలిలో ముద్దగట్టుకు పోయినట్టున్నాయి. ఆ వేళప్పుడు, రోడ్డు వెంట ఒంటరిగా నడవవలసి వచ్చినందుకు నేను లోలోపలే కొంత గాభరా పడిపోయిన మాట నిజం. ఓ భయ వీచిక రివ్వు రివ్వున నా రక్తనాళాల్లో పారాడింది. దిగులు దిగులుగా వెనుదిరిగి చూశాను. కొద్ది గజాల్లో ఓ ఆకారం కనిపించింది. నాతోబాటే రైలు దిగాడేమో, ఓ వ్యక్తి నా వెను వెంటనే వస్తున్నాడు. ప్యాంటు, కోటు, చెవులకడ్డంగా మఫ్లర్లు, కళ్ళకు సులోచనాలు – వాలకాన్ని బట్టి చూస్తే కాలేజీ విద్యార్థిలాగే వున్నాడు. ప్రాణం తేరుకున్నట్టయింది నాకు!

"మీరు హాస్టలుకేనా..." ఇంగ్లీషులో పలకరించాను...

"అవును.." ముక్తసరిగా జవాబు వచ్చింది.

మాట తీరును బట్టి చూస్తే అతడు తెలుగు వాడిలా తోచలేదు. కాలేజీలో ఆంధ్రులు, అరవలు, కన్నడులు' మళయాళీలేగాక ఉత్తరదేశం నుంచి, ఇంకా విదేశాలనుంచి వచ్చిన విద్యార్థులు గూడా ఉన్నారు. ఆయా ప్రాంతీయ భాషలు ఎప్పుడోగానీ వినిపించవు. పరాయి భాషలో ఎంతసేపు మాట్లాడినా ఆత్మీయత కుదరదు. దూర ప్రాంతంలో నా అన్నవాళ్ళు లేని చోట ఆత్మీయులైన స్నేహితులు గూడా లేకుండా కాలం గడపడం చాలా కష్టం. ప్రయత్నించని దోషం నాదిగాదు. కానీ నా మట్టుకు నాకు మాత్రం స్నేహం చేయదగ్గ వాడుగా ఒక్కడూ కనిపించలేదు.

ఆ రోజు రాత్రివేళ రోడ్డుపైన తారసిల్లిన వ్యక్తిలో స్నేహ లక్షణాలేవైనా ఉన్నాయో లేవో తెలుసుకోవాలన్న కుతూహలం కలిగింది నాకు!

"మీరు బియ్యేనా చదువుతూ వుండటం?" మళ్ళీ పలకరించాను.

బాణానికి బాణం ఎదురైనట్టుగా నా ప్రశ్న కొక ప్రశ్నే ఎదురైంది – "మీరూ సినిమా నుంచేనా వస్తూ వుండటం?"

తెల్లబోయినా బదులు చెప్పాను. చిత్రం చాలా బాగుందన్నాను. శాంసన్ పాత్రధారి అమోఘంగా నటించా డన్నాను. డలైలా అందంగా లేదా అన్నాడు. అవుననిపించుకున్నాక బిగ్గరగా నవ్వుతూ "ప్రిన్సిపాల్‌గారి మేజా సొరుగులో ఓ పేము బెత్తం వుంది. అది డలైలా కన్నా అందంగా వుంటుంది. డలైలా నడుములా అది గూడా వెయ్యి ఒయ్యారాలు పోతుంది. చూద్దువుగానీ వుండు." అన్నాడు.

నా పాటుకు నే నూరుకోక అతడ్ని మాటల్లోకి దించినందుకు నన్ను నేనే తిట్టుకున్నాను. ప్రిన్సిపాలుగారి దండ నీతిని గురించి ఆపాటికే ఎన్నో దారుణ గాథలు విని వున్నానేమో, ఇప్పుడదనంగా ఇంకొకటి తెలిసి వచ్చింది.

అంతలో గేటు దగ్గరికి వచ్చేశాము.

బావురు కప్పలాంటి పెద్ద తాళంతో సహా ఇనుప కమ్ముల తలుపులు పకడ్బందీగా బంధింపబడి వున్నాయి. గూడులాంటి గదిలో ఓ మూడుకాళ్ళ కుర్చీ మీద వాచ్‌మన్ కునికిపాట్లు పడుతున్నాడు.

వాచ్‌మెన్‌తో ఎలా మాట్లాడాలో నాకు తెలియదు. ఏ భాషలో మాట్లాడాలో అంతకన్నా తెలియదు!

అతడితో వ్యవహరించవలసిన బాధ్యతను పూర్తిగా నా తోడి వ్యక్తే తనే స్వీకరించాడు.

రెండు మూడు నిమిషాలపాటు హిందీలో వాగ్యుద్ధం కొనసాగింది. కీచురాయి గీ పెట్టినట్టుగా వాచ్‌మెన్ కూర్చున్న చోటునుంచి గొంతు చించు కున్నాడు. లేచివచ్చి తలుపులు తీయకపోతే ఆ హ్రస్వాకారాన్ని గుప్పిట్లో వేసి నులిమి పారవేసే ధోరణిలో నా 'అపరిచిత మిత్రుడు' అతడి పైపైకి వెళ్ళసాగాడు.

చివరికెలాగైతేనేం, కొంతసేపటికి మాధ్యేమార్గమొకటి స్ఫురించినట్టు తోచింది.

వాచ్‌మెన్ తన జేబులోనుంచి డైరీ పైకి తీశాడు.

వ్రాసుకోమని ధీమాగా తన పేరు చెప్పేశాడు నా సహనేరస్తుడు – "దీపక్ ది సౌజా."

"ఆప్‌కానామ్ క్యాహైసాబ్?" వాచ్‌మెన్ నావైపు తిరిగాడు.

చెప్పుకున్నాను.

తలుపులు తెరుచుకున్నాయి.

హాస్టలుదాకా నడిచేవెళ్ళానో, పరుగిడుతూ వెళ్ళానో గుర్తులేదు. గదిలో పడుకున్నానేగానీ నిద్రపట్టలేదు. తెల్లవారు జామున అది కలతనిద్రో, కాకపోతే పీడ కలో ఏదో ఒకటి మగతగా నన్ను చుట్టుముట్టింది. తెల్లవారేసరికి నాకోసం పిలుపు సిద్ధంగా వుంది...

కోరమీసాలు మెలిపెడుతూ లూసఫ్ లోకనాధన్ తన రూములో నాకు దర్శనమిచ్చాడు.

"అబ్బాయ్! ఇంకా రూల్సుకు అలవాటు పడలేదేమిటి? అర్ధరాత్రి షికార్లు దంచేస్తున్నావటగా!"

"మన్నించండి సార్! పొరపాటే చేశాను. ఇక ఎప్పుడూ యిలా జరగదు."

"చాల్లేవోయ్! నీ సంజాయిషీ ఎవరికి కావాలి? వాచ్‌మెన్‌ను నుగ్గు నూచంచేసి వేస్తా నన్నాడటగా నీ స్నేహితుడు? ఎవడతను?"

"అబ్బే, అతడెవరో తెలియదు సార్! చీకట్లో కలుసుకున్నానేమో, ఇప్పుడు గుర్తుపట్టగలనన్న నమ్మకమైనాలేదు. కానీ అతడు వాచ్‌మెన్‌తో పేరు చెబుతుండగా విన్నాను – అతడి పేరు దీపక్ ది సౌజా!"

"దీపక్ ది సౌజా!" వికటంగా నవ్వసాగాడు లూసఫ్ లోకనాధన్! "అది వాచ్‌మెన్ కళ్ళల్లో కారం చల్లడానికి పెట్టుకున్న మారుపేరు. అతడి నిజమైన పేరేమిటో నాకు కావాలి?"

"ప్రామిస్‌గా నాకు తెలియదు సార్! మీరే ఒట్టుపెట్టుకోమన్నా సరే."

"ఛత్, మాటలెందుకు! నాకు కావలసింది అతడి పేరు. కావలిస్తే నీకు సాయంకాలం ఏడుగంటలదాకా గడువిస్తున్నాను. ఆలోగా అతణ్ణి ట్రేస్ చెయ్యగలిగావో సరేసరి, లేకుంటే పది రూపాయలు అపరాధం చెల్లించుకోవాలి."

మారుమాట్లాడకుండా వెలుపలికి వచ్చేశాను. 'దీపక్ ది సౌజా' అన్నది మారు పేరైతే, యిక నిజమైనా పేరేమిటో తెలుసుకోగల మంత్ర తంత్రాలేవీ నాకు తెలియదు.

రహస్యాన్వేషణకు పూనుకోవడంకన్నా – పది రూపాయలు మనవి కావనుకుంటే సరిపోతుంది.

పదిరూపాయల నోటు జేబులో వేసుకుని ఈ రోజు సాయంకాలం ఏడు గంటలు కాక మునుపే లూసఫ్ లోకనాధన్‌గారి భేటీకి వెళ్ళాను.

"వచ్చావా అబ్బాయ్! అపరాధం చెల్లించనక్కరలేదులే! మొదటి తప్పుగా భావించి నీకు వార్నింగ్ యిస్తున్నాను." ప్రసన్నవదనుడై కనిపించాడు లూసఫ్ లోకనాధన్. తన ధోరణికి విరుద్ధంగా మృదువుగా మాట్లాడుతున్నాడు గూడా!" "ఈ లోకనాధన్ నిఘానుంచి తప్పించుకోవడం వాచ్‌మెన్‌ను బెదిరించినంత సులభంగాదు. నేరస్తుడు తనంతట తనే బయటపడి, స్వయంగా నేరం ఒప్పేసుకున్నాడు. ఇదిగో, ఇరవై అయిదు రూపాయలు జరిమానా గూడా చెల్లించాడు..."

"అలాగా! ఎవరు సార్ అతను?" కుతూహలంతో ప్రశ్నించాను.

"లిటరేచర్ స్టూడెంటు. బషీరుద్దీను. రూం నెంబరు నలభై రెండు..."

నా పాదాలు నన్ను అప్రయత్నంగా రూం నెంబరు నలభై రెండుకే తీసుకొని వెళ్ళాయి. కిటికి దగ్గర నిల్చుని అడవిలాంటి కాలేజీ ఆవరణలోకి చూస్తున్న బషీరుద్దీను, తలుపు కిరకిర వినిపించగానే వెనుదిరిగి చూచాడు.

"మిస్టర్ బషిరుద్దీన్! నువ్వు నన్ను గుర్తుపట్టవచ్చు. పట్టక పోవచ్చు! మూడో వ్యక్తి ఒకడు పరిచయం చేసి పెట్టెదాకా స్నేహభావం కుదరని ఈ కాలేజీ సమాజంలో నేనిలా నా అంతటా నేనుగా నీ గదిలోకి రావడం నీ కిష్టంగావచ్చు. కాకపోవచ్చు. నా పేరు రెడ్డి. నేను 'ఆంధ్రా' నుంచి వచ్చాను. నేను నీతిపరుడినో, కానో చెప్పలేను. కానీ నీతి నిజాయితీల పట్ల నా కెంతైనా గౌరవం వుంది. అందుకే నిన్నిలా అభినందించడానికి వచ్చాను.."

"వాట్ వాట్! ఏమిటోయ్ నువ్వు చెబుతున్నది? నాకేమీ అర్థం కావడం లేదు" అన్నాడు బషీరుద్దీను.

"ఎందుకూ కొరగాని అప్రయోజకుడివిగా ఉండడం కంటే అబద్ధాలు చెప్పడమైనా నేర్చుకోమన్నాడు వివేకానందుడు. అబద్ధాలు చాలామంది చెప్పగలరు. కానీ అవసరం వచ్చినప్పుడు అందువల్ల తమ కపకారం జరిగినా నిజం చెప్పగల చేవ అరుదుగా కొందరిలో మాత్రం వుంటుంది. అందుకే నిన్ను నేను హృదయపూర్వంగా అభినందిస్తున్నాను."

దుమ్మును దూళిని దులుపుకున్నట్లుగా బషీరుద్దీను నా కాంప్లిమెంటుకు పెదముఖం పెట్టేశాడు. "చాల్లే బ్రదర్! పొగిడింది చాలు! నీతికి, నిజాయితీకి నిలబడాలన్న మహదాశయమేదీ నాకు లేదు. ఎప్పటికి ఎలా చేయాలనిపిస్తే అలా చేసేయడం నా అలవాటు. నేను చేసిన తప్పుకు మరొక నిర్దోషి శిక్షింపబడటం నా మట్టుకు నాకు అర్థంలేని విషయంగా కనిపించింది. అంతే మరి! అందుకే అలా చేశాను."

"నేను థాంక్స్ చెప్పుకుంటూ వుండడం గూడా అందుకే! అలా చేయబట్టె లూసఫ్ లోకనాథన్‌తో బాటుగా నీ పేరు నాకూ తెలిసింది..."

"అవునవును. అన్నట్టు లూసఫ్ లోకనాథన్‌తో చెప్పింది మారు పేరు కాదు లేవోయ్ రెడ్డీ! ఇది నిజమైన పేరే! నేను కడపజిల్లా నుంచి వచ్చాను. ఎప్పుడైనా కడప జిల్లాకు వచ్చావుటోయ్ రెడ్డి! మా జిల్లా దోసకాయలకు, కర్బూజా పళ్ళకు, తమలపాకులకు ప్రసిద్ధి!"

"అవునట! నేను విన్నాను. కడప జిల్లా కాటకాలకు నెలవటగూడా! కానీ అలాంటి దుర్భిక్ష ప్రాంతంలో మార్దవానికి, మాధుర్యానికి పేరు మోసిన సరుకులు ఉత్పత్తి కావడం చాలా ఆశ్చర్యం..."

"కొంపదీసి నన్ను గూడా ఆ సరుకుల్లో కలిపేశావా ఏమిటి?" పెద్దపెట్టున నవ్వసాగాడు బషీరుద్దీను.

అలా ప్రారంభమైంది మా స్నేహం. రోజుకొక్కసారైనా మేము కలుసుకునేవాళ్ళం. "ఏం చేస్తున్నావోయ్ రెడ్డి! ఏమిటోగానీ చెప్పరానంత బోరింగుగా వుందోయ్ బ్రతుకు! ఎక్కడికైనా వెళ్ళిపోదామా!" అంటూ తుఫానులా గదిలోకి వచ్చేవాడు.

"వెళ్ళొచ్చు! కానీ లూసఫ్ లోకనాధన్ ఒప్పుకుంటాడా?" అనేవాణ్ణి.

"ఏడిచాడు! స్వేచ్ఛా విహంగాన్ని అడ్డుకోగల శక్తి ఎవరికుంది? విహంగ మంటే జ్ఞప్తికికొచ్చింది. వర్డ్సువర్తు ఏమన్నాడో తెలుసా?"

బషీరుద్దీన్‌కు ప్రపంచంలో అన్నింటికన్నా ప్రియమైనది ఆంగ్ల సాహిత్యం. హిగ్గిన్ బాదమ్స్‌లో క్రొత్తపుస్తకం వచ్చిందని తెలిస్తే ఆరోజు కాలేజి ఎగ్గొట్టేశాడన్నమాటే! క్రొత్త పుస్తకం దొరికితే చాలదు. చదువుకోడానికి అతని కొంక అనువైన చోటు కూడా కుదరాలి. నగరమంతా గాలించి తనకు నచ్చిన ప్రదేశాన్ని ఎన్నిక చేసేవాడు బషీరుద్దీన్. అది నగర గర్భంలోవున్న మృగశాల. "అరరే! ఆ కుందేలును చూడవోయ్ రెడ్డీ! ఎంత బాగా గెంతుతోందో చూచావా!" అంటూ నేరుగా కమ్ముల పంజరం దగ్గరికి పరుగెత్తేవాడు. కోతలకు బిస్కట్లు పంచేవాడు. చిలకల్ని పలకరించేవాడు. జంతువులతో ఆడుకున్నంతసేపూ ఆడుకున్నాక చొక్కా తీసి. చెట్టు కొమ్మకు తగిలించి హాయిగా పచ్చికపైన పవ్వళించేవాడు. మృగశాలసృష్టిపై చిత్రాల కన్నింటికీ నిలయం. ఆ విచిత్రాల కన్నింటికీ తలమానికంలా కనిపించేవాడు బషీరుద్దీను.

"మనం కాలేజీ విద్యార్థులం. ఇలా పసిపిల్లల్లా ప్రవర్తించడం ఏం బాగుంటుంది బషీరుద్దీన్? చూచిన వాళ్ళు నవ్వుకోరా?" అనేవాణ్ణి.

నాన్‌సెన్స్! ఆ మాట చెప్పకోయ్ రెడ్డీ! నీ నాగరికం తనంతా మూట గట్టి ఏటిలోకి గిరవాటు పెట్టు. కూర్చోవాలంటే ఒక నియమం. లేవాలంటే ఒక నియమం. ఈ నియమాల హద్దులో ఒదుగుల్లుపోతూ బ్రతుకును కుంచించుకోవలసిన అవసరమేమిటయ్యా? అడ్డూ ఆపూ లేకుండా ఆనందంగా నదిలా ప్రవహించి పోగూడదా జీవితం!"

బషీరుద్దీను ఫిలాసఫీ నా బుద్ధికి బాగున్నట్టే తోచేది. కానీ పైపైకి బాగానే వున్నట్టు కనిపించే పద్ధతుల్లో బ్రతక సాగితే కాలక్రమాన ఏవేవో ముప్పుతిప్పలు ఎదురుగావచ్చునన్న అనుమానం మాత్రం లేకపోలేదు. ఐనా బషీరుద్దీనుతో వాదించి అతడి సిద్ధాంతాన్ని త్రోసిరాజనిపించగల తెలివి తేటలు మాత్రం నాకు లేవు.

కానీ యిక్కడొకమాట నొక్కిచెప్పాలి బషీరుద్దీను మాత్రం తన సిద్ధాంతానికి అనుగుణంగానే నడచుకునే వాడు.

ఎలాగంటారా? అదే చెబుతున్నాను.

చదవాలనిపిస్తే రాత్రి రాత్రంతా మేలుకుని చదువుతూ వుండిపోయేవాడు. బద్ధకిస్తే ఎనిమిదింటికే నిద్రపోయేవాడు. నిద్ర అతడికి పిలవగానే పలికేది. సినిమా బాగుండకపోతే ఒక్కొక్కప్పుడతనికి హాల్లోనే నిద్రపట్టి పోయేది. అతనికీ ఆకలికి చాలా దగ్గరి చుట్టరికం. ఆకలౌతున్నట్టు అనుమానం కలిగినా చాలు - దగ్గర్లో ఏ హోటలుంటే ఆ హోటల్లోకి దూకేసేవాడు. ఏది దొరికితే దానితో పొట్ట నింపుకునే వాడు భోజనానంతరం వెచ్చగా సిగరెట్టు కాల్చుకుంటూ "అబ్బ - ఎంత హాయిగా వుందోయ్ రెడ్డీ! ఇప్పుడేం చేయాలో తెలుసా?" అనేవాడు. "ఏం చేయాలి?" అనేవాణ్ణి. "నేరుగా బీచికి దారితీద్దాం" అనేవాడు.

నా సందేహాలు నావి! వెళ్ళవచ్చు గానీ అర్ధరాత్రి దాటిన తరువాత మా గమ్యస్థానానికి రైళ్ళులేవు...

"ఫరవాలేదువోయ్! టాక్సీలో వెళ్ళిపోదాం..." అనేవాడు బషీరుద్దీను.

టాక్సీలు దొరక్కపోవు. నిజమేగానీ ఆ వాచ్‌మెన్‌తో గొడవ పడవలసి వుంటుంది.

"వాడి ముఖం! రెండు రూపాయలు పారేస్తే కుక్కలా తోకాడించదూ!"

ఆ మాటగూడా నిజమే! కానీ మా దగ్గర మిగిలివున్న డబ్బులు టాక్సీకి మాత్రమే సరిపోతాయి.

"ఐతే గోడ దూకేద్దాం" అనేవాడు బషీరుద్దీను.

కాలేజీలో ఏ ఫంక్షను జరిగినా అందులో బషీరుద్దీను పాటలకు తప్పని సరిగా ఒక అవకాశం వుంటూ వుండేది. ఎంతో కొంత కళాభినివేశం వున్న వ్యక్తి పదిమందిలోనూ తన ఆధిక్యతను పాదుకొల్పుకోడానికి ప్రయత్నించడం మనకు విదితమే! బషీరుద్దీనుకు అలాంటి ఉద్దేశం ఏ కోశానా వుండేది గాదు. కృష్ణశాస్త్రిగారన్నట్టు పువ్వులెందుకైతే తావులు వెదజల్లుతన్నాయో, చంద్రుడెందుకైతే చంద్రిక వెదజల్లుతున్నాడో, ఏల సలిలం పారుతోందో! ఏల గాడ్పు విసరుతోందో అలా ప్రతిఫలాపేక్ష లేకుండా తన ఆనందం కోసం తాను పాడుకునే వాడు బషీరుద్దీను. ఒకసారి కాలేజిలో హాస్టలు డే సెలబ్రేషన్స్ జరిగాయి. ఒకానొక సుప్రసిద్ధ సినిమా డైరక్టరుగారు ముఖ్య అతిథిగా విచ్చేశారు. బషీరుద్దీను గానం విని అతడు పరవశించిపోయి, తాను తీయబోతున్న సినిమాలో అతడికొక అవకాశాన్ని వాగ్దానం చేశాడు, పది రోజులు గడిచాయి. డైరెక్టరుగారి వాగ్దానాన్ని బషీరుద్దీను ఖాతరు చేసినట్టే లేదు. నాలాంటి శ్రేయోభిలాషులు కొందరు చెవిలో యిల్లు కట్టుకుని పోరగా, ఆ డైరక్టరుగారినొక పర్యాయం కలుసుకోడానికి సమ్మతించాడు. ఇతగాడు వెళ్ళిన సమయానికి తన పనుల తొందరలో తానుండి పోయాడేమో, ఆ డైరక్టర్ కాలేజిలో మాట్లాడినంత ఆప్యాయంగా స్టూడియోలో మాట్లాడలేదు. బషీరుద్దీన్ గిరుక్కున వెనుదిరిగి వచ్చేశాడు. "ఆ ఏడుపుగొట్టు ముఖం ఛాన్సు యివ్వడమూనూ, మనం పాడడమూనా! ఐనా మన తెనుగు వాళ్ళు మనల్ని ఎక్కడ ఎంకరేజ్ చేస్తారోయ్ రెడ్డీ! మనం వెళ్తే హిందీ ఫీల్డుకే వెళ్ళాలి" అన్నాడు.

ప్రతి మానవుడి జీవితంలోనూ మరపురాని మధురానుభవాలు కొన్ని వుంటాయి. బషీరుద్దీనుతో కలసి బీచికి వెళ్ళిన అనుభవాలు అలాంటివి. మేము వెళ్ళే సమయానికి సముద్రతీరం బాగా నిర్జీవమైపోయి వుండేది. కొన్ని సందర్భాలలో చిమ్మ చీకటి. మరికొన్ని వేళల్లో పుచ్చపువ్వులాంటి వెన్నెల. గిల్లికజ్జా లాడుకుంటున్న పసిపిల్లల్లా అంబుధిలో అలలు మా ఎదుట ఎడతెగని క్రీడా విలాసాలు నెరపుతుండేవి. గొంతెత్తి స్వేచ్ఛగా పాడుకోడానికి అంతకంటే తగిన చోటు ప్రపంచంలో వుండదనేవాడు బషీరుద్దీను. సాగర సంగీతంలో పోటీకి కూర్చున్నట్టుగా గంటల తరబడీ, మళ్ళీ ఆకలయేదాకా పాడుతూ వుండిపోయేవాడు. ఎంత చక్కగా పాడేవాడు బషీరుద్దీన్! వసంతంలో కోకిల గానం, తెల్లవారు జామున సన్నాయి మేళం, అర్ధరాత్రి దాటిన తరువాత నీరవ నిశీధిని చీల్చుకుంటూ వినవచ్చే వేణుగానం – వీటినెప్పుడైనా విన్నారా మీరు? అంత నాజూగ్గా అంతకమ్మగా, అంతగా పారవశ్యం కలిగిస్తూ పాడేవాడు బషీరుద్దీను."

❀ ❀ ❀ ❀

భూమ్యాకర్షణ నుంచి తప్పించుకుని వేరొక కక్ష్యలోకిదూసుక పోయిన రాకెట్టులా – శబ్ద ప్రపంచంలోనుంచి ఆలోచనా ప్రపంచంలోనికి జారుకున్నట్టుగా ఉన్నట్టుండి మౌన ముద్ర వహించాడు రెడ్డి.

"ఏమైంది రెడ్డీ! స్టేషను లేనిచోట రైలుబండి ఆగిపోయినట్టుంది" అన్నాడు రాధాపతి.

దామోదరం శ్రుతి కలిపాడు. "కొంపదీసి కథ పూర్తయిపోయిందని చెప్పవు గదా?"

"చెప్పినా చెప్పవచ్చు. కథ దాదాపుగా పూర్తయినట్టే!" అన్నాడు రెడ్డి.

"అలాగైతే నువ్వు చెప్పింది కథ మాత్రం కాదు. కనీసం స్కెచ్ అయినా కాదు. ఆది మధ్యాంతాల్లో నువ్వు చెప్పిన దానికి మొదటి రెండూ వున్నాయిగానీ, చివరిదిలేదు. తలలేని మనిషి ఎలాగో, ముగింపులేని కథ అలాగు!"

"కావచ్చు అందుకని నేను చేయగలిగిందేమీలేదు. జీవన పథంలో మేమిద్దరమూ ఎంత హఠాత్తుగానైతే కలుసుకున్నామో, అంత ఆకస్మికంగానే విడిపోయాము. ఆ విడిపోవడం గూడా విద్యాభ్యాసం సాంగోపాంగంగా పూర్తయిన తర్వాత జరిగిన సహజ సంఘటన గాదు."

"సర్లే! ఇంకా వివరణెందుకు? ఏదో పొరబాటు చేయడం వల్ల నీ స్నేహితుడు కాలేజీనుంచి బహిష్కరింపబడి వుంటాడు. అంతేనా మిస్టర్ రెడ్డీ!"

"అబ్బే. అలాంటిదేమీ జరగలేదు. ఎంతగా పొరబాటు చేసినా బషీరుద్దీను లాంటి స్టూడెంటుని కాలేజీనుంచి తరిమివేయడం జరగదు. కానీ అతడు వెళ్ళి పోయిన మాట నిజం!"

రెడ్డి సిగరెట్ ముట్టించుకుని నింపాదిగా కొనసాగించాడు. "బషీరుద్దీనుకు తల్లిదండ్రులులేరు. చనిపోయిన తండ్రి ఏదో మంచి ఉద్యోగమే చేసి కొంత డబ్బు మిగిల్చిపోయాడు. ఆ డబ్బు బషీరుద్దీను మేనమామ దగ్గర వుండిపోయింది. దానికి సంబంధించిన జమా ఖర్చుల వివరాలను గురించి బషీరుద్దీన్‌కు తెలిసింది చాలా తక్కువ. అవసరమైనప్పుడల్లా ఇతడు జాబు వ్రాయడం, జాబు వ్రాసినప్పుడల్లా అతడు డబ్బు పంపడం – అలా జరుగుతూ వచ్చింది. కానీ ఒక సందర్భంలో అతడి జాబుకు బదులుగా డబ్బు రాలేదు సరికదా, ఒక ప్రత్యుత్తరం మాత్రం వచ్చింది. ఆ విధంగా మామగారి దగ్గరనుంచీ అతడికొక ఉత్తరం వచ్చిన ఉదంతం గూడా చాలా కాలం తర్వాత తెలిసింది. కానీ అప్పటికప్పుడు తెలిసిందేమిటంటే బషీరుద్దీను కాలేజీలో కనిపించలేదు. ఓ రోజు తెల్లవారేసరికి అతడిగది ఖాళీగా కనిపించింది. ఎటొచ్చీ బషీరుద్దీన్ ఆచూకీని గురించి చెప్పగలిగిన వాణ్ణి నేనొక్కణ్ణే! అందరూ నన్ను చుట్టుముట్టి బషీరుద్దీన్ అంతర్ధానాన్ని గురించి ప్రశ్నల వర్షం కురిపించారు. "అబ్బే ఆ విషయాన్ని గురించి మీ కెంత తెలుసునో నాకూ అంతే తెలుసు" అన్నాను. బషీరుద్దీను మాయమైపోయిన క్రొత్తలో నాకా కాలేజీ కారాగారంలా అనిపించింది. అంతకంటే ఆండమాన్ దీవుల్లో ప్రవాస శిక్షే నయంగా తోచింది. చదువుకు స్వస్తి చెప్పి స్వగ్రామానికి వెళ్ళిపోతే బాగుండునని ఎన్నోసార్లు అనుకున్నాను. కానీ ఎంతగా తమకు సరిపడక పోయినా సామాన్య మానవులు పరిస్థితులతో సంఘర్షణ పెట్టుకోరు. ఎంతో కొంత లొంగుబాటు ప్రకటించి రాజీ పడడానికే సమ్మతిస్తారు.

నేనూ అదే పనిచేశాను. క్లాసుకు వెళ్తున్నాను. లెక్చర్లు వింటున్నాను. పాఠాలు చదువుకుంటున్నాను. రాత్రుల్లో నిద్రపోతున్నాను. అలాగే కొంతకాలం గడిచిపోయింది. ఎప్పుడైనా బషీరుద్దీను కనిపిస్తే, ఆ కనిపించడం కలలో మాత్రమే జరిగేది. ఇక ఇలలో అతడు నాకు కనిపించడేమో అనుకున్నాను..."

"మళ్ళీ కనిపించాడన్న మాట?"

"ఎక్కడ కనిపించాడు?"

"ఎలా కనిపించాడు?"

"ఓ ఆదివారంనాడు సిటీకి వెళ్ళాను. మ్యాట్నీ నుంచీ ఈవలికి వచ్చేసరికి ఆరుగంటలైంది. రోడ్డుపైన నడుస్తుండగా వీధి దీపాలు వెలిగాయి. ఏదైనా పుస్తకం కొనుక్కుందామని ఓ బుక్‌షాపు లోపలికి వెళ్ళబోతుడంగా, షాపులో నుంచి వెలుపలికి వస్తూ ఎదురయ్యాడు బషీరుద్దీన్. రెండు మూడు మాసాల ఎడబాటు ఆ తరువాత ఆప్తమిత్రుడు కనిపించగానే కళ్ళల్లో కన్నీళ్ళు గిర్రున తిరిగాయి. మాటలు వెలికి వచ్చాయిగావు. విడిపించుకుని పారిపోతాడేమోన్నట్టుగా అతడి చేతిని గట్టిగా పట్టుకున్నాను. బషీరుద్దీను నా భుజం పైన చేయి వేసుకున్నాడు. ఇద్దరమూ కలిసి సాగరాభిముఖంగా నడవసాగాము..."

"ఈ మాత్రానికే ఇలా విచారిస్తా వెందుకోయ్ రెడ్డీ!" ప్రారంభించాడతను– "అసలు నీకు చెప్పే వద్దామనుకున్నాను. కానీ చెబితే నువ్వు నన్నక్కడినుంచి కదలనీయవని నాకు తెలుసు. విషయమేమిటంటే, మా నాన్నగారు, చనిపోయే నాటికీ మా యింట్లో ఎంత లేదన్నా పదివేల రూపాయల రొఖ్ఖం వుంది. అందులో నా చదువుకు నాలుగైదు వేలకన్నా ఖర్చై వుండదు. మా మామయ్య నా కోసం తన స్వంత డబ్బు ఖర్చు పెడుతున్నట్టుగా బాధపడి పోవడం చూస్తే నాకు మనుషుల పైనే నమ్మకం నశించింది. ఉన్నపాటున ఇలా వచ్చేశానా, ఇక్కడొక కంపెనీలో ఉద్యోగం దొరికింది. సుందరమయ్యరు వీధిలో నవాబుల కాలం నాటి మేడ ఒకటి వుందిలే, దానిలో పావురాల గూళ్ళ నమూనాలో గదులున్నాయి. ఓ గదిలో నా నివాసం. నివాసమంటే రాత్రుల్లో పడుకోవడం మాత్రమే! తెల్లవారితే ఇదిగో, ఇలాగే రోడ్లపైన – కాకపోతే ఆఫీసులో కాలం గడచిపోతోంది. కాలేజిలో నైతే క్లాసుకు వెళ్తుండేవాడినా, ఇప్పుడదే విధంగా ఆఫీసుకి వెళ్తున్నాను. మళ్ళీ అదే రొటీన్ జీవితం. ఏం బ్రతుకోయ్ రెడ్డీ! 'క్వీన్స్ రైవల్' చదివావా – సరోజినీదేవిది! క్వీన్ గుల్నార్ చెబుతుంది – 'నో సవర్ ఆర్ స్టా' అంటూ చప్పిడి జీవితాలను గురించి! ఉప్పూ, ఊరగాయ లేని బ్రతుకులోయ్ మనవి!"

ఈ అసంతృప్తీ, ఈ నిరాశ బషీరుద్దీన్‌ను ఎక్కడికి తీసుకుని వెళ్ళనున్నాయో నాకా క్షణాన తెలిసిందిగాదు. కానీ ఆ సత్యం గూడా అనతికాలంలోనే తెలిసి వచ్చింది. వారం రోజులు గడవకముందే బషీరుద్దీను దగ్గరనుంచి నాకో ఉత్తరం వచ్చింది. అందులో వున్నవి గూడా నాలుగే ముక్కలు. "డియర్ మిస్టర్ రెడ్డీ! సిటీకి వస్తే నువ్వు నాకోసం సుందరమయ్యరు వీధికి రావద్దు. గదిలో నేనుండను. గదిలోనే ఏమిటి, ఇకపైన నేను నీకీ నగరంలోనే కనిపించను. కంపెనీలో ఉద్యోగం అన్నాను గదూ! ఆ మేనేజరుకు నా

ఇంగ్లీషు అర్థమైందిగాదు. అర్థం అడిగి తెలుసుకోవచ్చుగదా, ఊంహూ, ఆ మాత్రం సహృదయత ఎక్కడ ఏడ్చింది! అతగాడు నా వ్రాతలోనే తప్పులు పట్టసాగాడు వాడికీ వాడి ఉద్యోగానికీ నమస్కారం పెట్టేశాను. వెళ్ళిపోతున్నాను. ఎక్కడికో చెప్పలేను. బాగా చదువుకుని పైకి రావలసిన వాడివి. విష్ యూ గుడ్‌లక్... నిరంతరం నీ మిత్రుడు బషీరుద్దీను."

❋ ❋ ❋ ❋

"ఈ ముగింపు గూడా అట్టే తృప్తికరంగా లేదు" అన్నాడు రాధాపతి.

"బషీరుద్దీన్ అలా వెళ్ళిపోయి ఏడెనిమిదేళ్ళయింది. ఈ ఏడెనిమిదేళ్ళ పొడుగునా అతడి ఆచూకీ తెలుసుకోడానికి శతవిధాల ప్రయత్నించాను. సాధ్యంకాలేదు. ఈ మధ్యకాలంలో నేను వంద కథలైనా వ్రాసి వుంటాను. వ్రాయడానికి వీలుండి గూడా నేను వ్రాయలేకపోయిన కథ ఒక్కటే! అదే బషీరుద్దీను కథ!"

"ఎందుకు వ్రాయలేకపోయావు రెడ్డీ!" దామోదరం ప్రశ్నించాడు.

"ముగింపు తెలియకపోవడంవల్ల...ఎలాంటి ముగింపైతే సముచితమో, అది గూడా నేనూహించలేకపోయాను. డైరెక్టరు మర్యాదగా చూడలేదని బషీరుద్దీన్ సినిమా ఛాన్సు పోగొట్టుకున్నాడు. మామగారు నిష్ఠూరంగా జాబు వ్రాశాడని కాలేజీ వదిలిపెట్టేశాడు. మేనేజరుతో పొసగక ఉద్యోగానికి రాజీనామా ఇచ్చేశాడు. ఆ తరువాత ఏమై ఉంటాడతను? బషీరుద్దీన్‌ను గురించి తలచుకున్నప్పుడల్లా నాకో విషయం మాత్రం జ్ఞప్తికి వస్తుండేది. ఒక సందర్భంలో అతడు జీవితం నదిలా ప్రవహించి పోవాలన్నాడు. కానీ అడ్డూ ఆపూ లేకుండా ప్రవహించిన నదీ జలాలు చివరికేమౌతాయి? కడలి పాలౌతాయి. వాటివల్ల వసుంధర సస్యశ్యామలం కాదు. వాటివల్ల ప్రజానీకానికి ఆనందం కలగదు. మీదు మిక్కిలి వరదలొస్తే పంట పొలాలు నాశనమౌతాయి. ఊళ్ళునట్టేట కలుస్తాయి..."

"నిజమే! అలాంటి జీవిత గాధకు అంతకంటే సముచితమైన ముగింపు కనిపించదు" అన్నాడు దామోదరం.

ఈ ఊహ కప్పటికప్పుడు రాధపతి కొన్ని రెడీమెడ్ దుస్తులు తొడగసాగాడు.

"రోలింగ్ స్టోన్ గేదర్స్ నోమాస్, అనడం వినలేదా? 'పెక్కు భంగుల్ వివేక భ్రష్ట సంపాతముల్' అని భర్తృహరి మరింత ఘాటుగా చెప్పాడు గూడా! బషీరుద్దీనేమౌతాడు? అలాంటివాళ్ళకు ఏ ఊరూ రుచించదు. ఏ ఉద్యోగమూ నచ్చదు, తెగిన గాలిపటంలా కొట్టుకపోతారు. చివరికే ముళ్ళ పొదలోనో తగులు కుంటారు విరిగి...చిరిగి"

"స్టాప్ స్టాప్!" అన్నాడు రెడ్డి. "ఈ ముగింపు కేవలం ఒక ఊహ. ఒక్కొక్కప్పుడు జీవితం మన ఊహల్ని తల్లక్రిందులు చేస్తుంది. అదే జీవితంలో ఉన్న చమత్కారం..."

కొనసాగించాడు రెడ్డి.

"గడచిన వేసవి సెలవుల్లో హైదరాబాదు వెళ్ళాను. రచయితల సభల్లో పాల్గొంటున్నానని తెలిసి ఎవరో ఒక వ్యక్తి నన్ను కలుసుకోడానికి వచ్చాడని తెలిసింది. వెళ్ళి చూద్దును గదా. అతడు బషీరుద్దీను – ఊపిరి త్రిప్పుకోడానికైనా వీల్లేకుండా బిగ్గరగా కౌగిలించుకున్నాడు – "మహదానందంగా ఉందోయ్ రెడ్డి! పత్రికల్లో నీ కథ పడినప్పుడల్లా

నాకు పండుగలా ఉండేది. పదిమందితోనూ ఇతడు నా మిత్రుడని చెప్పుకునేవాణ్ణి. ముఖ్యంగా మా ఆవిడకు నీ కథలంటే చాలా యిష్టం..."

ఆనందాశ్రువుల్ని తుడుచుకుంటూ "పెళ్ళిచేసుకున్నావా బషీరుద్దీను?" అన్నాను.

"ఇద్దరు బిడ్డలు గూడా! నువ్విక్కడ ఉన్నంతకాలం మా ఇంట్లోనే అతిథ్యం పుచ్చుకోవాలి..."

బషీరుద్దీన్ నన్ను తన ఇంటికి తీసుకెళ్ళాడు. ఘోషా మహల్ ప్రాంతంలో అతడి నివాసం. అతడి భార్యకు మాత్రం ఘోషా వున్నట్టులేదు. వెళ్ళగానే ఉపాహారంతో సత్కరించి చిరకాల పరిచితుణ్ణి పలకరించినట్టుగా ఆమె అరమరికలు లేకుండా మాట్లాడసాగింది– "ఎంతకాలానికి వచ్చారండి అన్నగారూ! ఈయన మిమ్మల్ని తలుచుకోని రోజుండదు. మా ప్రాంతంలో ఏ కాపువాళ్ళ అమ్మాయి అయినా "మా రెడ్డి" అంటూ ప్రారంభించిందంటే ఆమె తన భర్తను గురించి చెబుతోందని అర్థం! 'మా రెడ్డి మా రెడ్డి' అంటూంటారు గదా! ఆయన మీకు పెనిమిటా ఏమిటండీ? అనేదాన్ని. 'అంతగా దగ్గరివారు గదా! మరైతే జాబు వ్రాసి ఇక్కడికోసారి పిలిపించగూడదు?' అనేదాన్ని 'ఎక్కడున్నాడో ఏమిటో, ఏ పత్రికల వాళ్ళకైనా వ్రాసి అడ్రసు తెలుసుకోవాలి' అంటుండేవారు. చివరి కెలాగైతేనేం మీరే దొరికిపోయారు..."

"నేను దొరకడాని కేముందమ్మా! బషీరుద్దీన్‌ను ఈ స్థితిలో చూడగలిగినందుకు పరమానందంగా వుంది. ఈ కోడెకు ముకుదాడు వేయగలిగినవారు లేరనే అనుకున్నాను..."

"ఆ మాటెందుకు లెండన్నగారూ నేను కాబట్టి ఈయనతో వేగుతున్నాను. మరొకరూ మరొకరూ అయితే..."

తుఫాను గాలిలా భార్య మాటలకు అడ్డొచ్చాడు బషీరుద్దీను – "అబ్బే, ఈవిడ మాటలు నమ్మకోయ్ రెడ్డీ! అన్నీ అబద్ధాలే! మనం ఎంత చెబితే అంతగాఢంగా మారిపోయి చాలాకాలమైంది. తన మాట వినకపోతే పగలంతా ఉద్యోగం చేస్తూ, రాత్రుల్లో ఈవెనింగు కాలేజీకి వెళ్ళి నేను బియ్యే పూర్తిచేసే వాడినే కాను. ఉన్న పొలం కాస్తా అమ్మి ఇక్కడ ఈ మేడ కొనేవాణ్నిగాను. నెలకైదు వందల రూపాయలు సంపాదిస్తున్నానా, ఈవిడ నా స్వంత ఖర్చుల కోసం పాతిక రూపాయలు మాత్రమే మంజూరు చేసింది. అంతకుమించి ఒక రూపాయి ఖర్చు చేయాలన్నా తన పర్మిషన్ కావలసిందే! నెలకొకటి రెండు సినిమాలు మాత్రమే చూడాలి. దానికైనా కుటుంబమంతా కలిసే వెళ్ళాలి. సాయంకాలాల్లో ఏడు కొట్టకమునుపే ఇల్లు చేరుకోవాలి. పెందలకడనే పడుకోవాలి. తొలికోడి కూతతో నిద్రలేవాలి. ఏమిటో లేవోయ్ రెడ్డీ! బ్రతుకిలా పరిణమిస్తుందని అనుకోలేదు..."

బషీరుద్దీను నిట్టూర్చలేదు. నవ్వుతున్నాడు!

♦ 'జ్యోతి' మాసపత్రిక, **1965** ♦